నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, మంగళవారం 14 మే 2024 | VIKARABAD



ఓటింగ్ కోసం పోటెత్తిన గ్రామీణులు

కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్‌రెడ్డి, సొంతూర్లలో ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు

ధారూరు మండలం అల్లీపూర్, తాండూరు పట్టణంలో కొంతసేపు మొరాయించిన ఈవీఎంలు

రాజేంద్రనగర్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని పర్యవేక్షించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక

పోలింగ్ ముగిశాక కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంల తరలింపు

జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు



బొంరాస్‌పేటః తుంకిమెట్ల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు

## ముగిసిన పోలింగ్

# ఫలితం..పదిలం

రంగారెడ్డి, మే 13 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎప్పటిలాగే.. పట్టణాల్లో ఓటర్లు నిర్లక్ష్యం కనబర్చినప్పటికీ.. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు మాత్రం పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. హైదరాబాద్ నుంచి పల్లెలకు వెళ్లేందుకు ఓటర్లు క్యూ కట్టడంతో ప్రధాన రహదారులన్నీ కిక్కిరిశాయి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితోపాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. రాజేంద్రనగర్‌లోని నారం గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ శశాంక పర్యవేక్షించారు. బంజారాహిల్స్‌లో కలెక్టర్ శశాంక ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నది.

### ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2,877 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల విధుల్లో మైక్రోఅబ్జర్వర్లు 216 మంది, పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు కలుపుకొని మొత్తం 13,443 మంది విధులు నిర్వర్తించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి ఏడు గంటల నుంచి సాధారణ పోలింగ్ షురూ కాగా, సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సాయంత్రం 6 గంటల్లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో కొనసాగిన ఓటింగ్ సరళిని రంగారెడ్డి కలెక్టర్ శశాంక రాజేంద్రనగర్‌లోని నారం గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తును చేపట్టారు. వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో ఎన్నికల అధికారులతోపాటు పోలీస్ శాఖ ఊపిరి పీల్చుకుంది.

### ఓటు వేసిన ప్రముఖులు..

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన స్వగ్రామమైన చేవెళ్ల నియోజకవర్గంలోని కౌకుంట్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నవాబుపేట మండలంలోని చించల్‌పేట్‌లో ఓటు వేశారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, టీటీడీ డైరెక్టర్ సీతారెడ్డి మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సినీ నటుడు బిత్తిరి సత్తి చేవెళ్ల నియోజకవర్గంలోని పామెన గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### జిల్లాలో స్ట్రాంగ్ రూములకు ఈవీఎంల తరలింపు..

పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపర్చారు. జిల్లాలో ఓటింగ్ కోసం 3,591 కంట్రోల్ యూనిట్లను, 10,757 బ్యాలెట్ యూనిట్లను, 4,008 వీవీప్యాట్లను వినియోగించారు. పోలింగ్ ప్రక్రియ ముగియగానే ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను డిస్ట్రిబ్యూటరీ సెంటర్లకు తరలించి అక్కడి నుంచి పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించారు.

స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్‌తోపాటు మూడంచెల భద్రతా విధానాన్ని ఏర్పాటు చేశారు. తొలి అంచెలో పారా మిలిటరీ, రెండో అంచెలో సాయుధ సిబ్బంది, మూడో దశలో సివిల్ పోలీసులు భద్రతా విధుల్లో ఉంటారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ఫైరింజన్లను అందుబాటులో ఉంచారు. జూన్ 4న చేవెళ్ల మండలంలోని బండారి శ్రీనివాస్ కళాశాలలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.

### పోలింగ్ శాతం 60.07

'చేవెళ్ల పార్లమెంటు స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 60.07 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉండగా పోలింగ్‌లో 60.07శాతం మంది తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. ఎన్నికల బరిలో 43 మంది ఉండగా.. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. 2019 ఎన్నికల్లో 53.25 శాతం పోలింగ్ నమోదు కాగా, తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది.' చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 70.84 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా శేరిలింగంపల్లిలో 43.11 శాతం నమోదైంది.

### చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ శాతం

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటలకు 10.28 శాతం పోలింగ్ నమోదైంది. 11 గంటలకు 20.35 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 34.56 శాతం, 3 గంటలకు 45.35 శాతం, సాయంత్రం 5 గంటలకు 53.15శాతం పోలింగ్ నమోదైంది.

**నియోజకవర్గాల వారీగా..**

| నియోజకవర్గం | పోలింగ్ శాతం |
|---|---|
| మహేశ్వరం | 51.70 |
| రాజేంద్రనగర్ | 53.13 |
| శేరిలింగంపల్లి | 43.11 |
| చేవెళ్ల | 70.84 |
| పరిగి | 65.98 |
| వికారాబాద్ | 69.44 |
| తాండూరు | 66.34 |

### అధికార యంత్రాగానికి కృతజ్ఞతలు
**– కలెక్టర్ శశాంక**

ఎన్నికలను సజావుగా శాంతియుతంగా నిర్వహించుటలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన పోలీస్ అధికారులకు, ఏఆర్‌వోలకు, ఏఐఆర్‌వోలకు, నోడల్ అధికారులకు, బీఎల్‌వోలకు, బీఎల్‌వో సూపర్ వైజర్లకు, వివిధ శాఖలకు సంబంధించిన ఎన్నికల సిబ్బందికి కృతజ్ఞతలు.

## బారులుతీరారు..

వికారాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) :

వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఒకట్రెండు చోట్ల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 68 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో 70 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా పరిగి నియోజకవర్గంలో 66 శాతం పోలింగ్ నమోదు కాగా, తాండూరు నియోజకవర్గంలో 67.30 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, జిల్లావ్యాప్తంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ధారూరు, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల్లోని గిరిజన తండాల్లోని మహిళలు, యువత అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూరు మండలం అల్లీపూర్ గ్రామంలో, తాండూరు పట్టణంలోని నంబర్.1 ఉన్నత పాఠశాలలో దాదాపు అరగంటపాటు ఈవీఎంలు మొరాయించగా, అదనపు ఈవీఎంలను ఏర్పాటు చేయడంతో తిరిగి పోలింగ్ కొనసాగింది. జిల్లావ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మర్పల్లి మండల కేంద్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంగం లక్ష్మీబాయి పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి తమ కుటుంబ సభ్యులతో ఓటేశారు. దోమ మండలం శివారెడ్డిపల్లిలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, బషీరాబాద్ మండలం ఇందర్‌చెడ్‌లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పరిగి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### ఈవీఎంల తరలింపు..

పోలింగ్ పూర్తయిన అనంతరం తాండూరు నియోజకవర్గంలోని ఈవీఎంలను సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో, పరిగి నియోజకవర్గ పరిధిలోని ఈవీఎంలను పరిగి పట్టణంలోని మినీ స్టేడియం, కొడంగల్ నియోజకవర్గంలోని ఈవీఎంలను కొడంగల్ పట్టణంలోని జూనియర్ కాలేజీకి, వికారాబాద్ నియోజకవర్గంలోని ఈవీఎంలను వికారాబాద్ పట్టణంలోని మేరీ నాట్ స్కూల్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి చేవెళ్లలోని లెక్కింపు కేంద్రానికి కేంద్ర బలగాల ఎస్కార్ట్స్ మధ్య తరలించి భద్రపర్చారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడనున్నాయి.

### ఓటింగ్ శాతం..

- ఉదయం 9 గంటల వరకు వికారాబాద్ నియోజకవర్గంలో 10.37 శాతం, పరిగి నియోజకవర్గంలో 10.9 శాతం, తాండూరు నియోజకవర్గంలో 11.85 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 11.19 శాతం పోలింగ్ నమోదైంది.
- ఉదయం 11 గంటల వరకు వికారాబాద్ నియోజకవర్గంలో 27.03 శాతం, పరిగి నియోజకవర్గంలో 25.61 శాతం, తాండూరు నియోజకవర్గంలో 23.12 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 29.32 శాతం పోలింగ్ నమోదైంది.
- మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరిగి నియోజకవర్గంలో 43.57 శాతం, వికారాబాద్ నియోజకవర్గంలో 45.16 శాతం, తాండూరు నియోజకవర్గంలో 41.05 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 47.59 శాతం పోలింగ్ నమోదైంది.
- మధ్యాహ్నం 3 గంటల వరకు పరిగి నియోజకవర్గంలో 56.36 శాతం, తాండూరు నియోజకవర్గంలో 54.95 శాతం, వికారాబాద్ నియోజకవర్గంలో 57.63 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 60.44 శాతం పోలింగ్ నమోదైంది.
- సాయంత్రం 5 గంటల వరకు పరిగి నియోజకవర్గంలో 62.59 శాతం, వికారాబాద్ నియోజకవర్గంలో 64.44 శాతం, తాండూరు నియోజకవర్గంలో 63 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 65.54 శాతం పోలింగ్ నమోదైంది.



వికారాబాద్‌లో ఓటు వేసిన కలెక్టర్ నారాయణరెడ్డి



నగరంలో ఓటేసిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక



శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



కౌకుంట్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## చేవెళ్ల ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

రంగారెడ్డి, మే 13(నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ..అహర్నిశలు కష్టపడ్డ బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధంగా భావించి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ఓట్లు వేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచార యజ్ఞంలో తన వెన్నంటి నిలిచిన ప్రజలకు, ముందుండి నడిపించిన పార్టీ నాయకులను, కార్యకర్తలను జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు.



నవాబుపేట మండలంలోని చించల్‌పేటలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఇందర్‌చెడ్‌లో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



పరిగిలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దంపతులు



మీర్జాపూర్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ఎలిమినేడులో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



వికారాబాద్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ దంపతులు



కడ్తాల్ మండలం చల్లంపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్




శేరిగూడలో ఓటు వేసిన భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్



కేశంపేటలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్